క్లుప్తంగా

కుర్మిద్ద మదర్ డెయిరీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన పాడి రైతులు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్దలో గురువారం మదర్ డెయిరీ సంస్థ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామంలో ఉన్న పాల ఉత్పత్తిదారులు హాజరయ్యారు. రైతాంగం మేలు కోసం, రైతుల కుటుంబాల అవసరాల కోసం చేపట్టాల్సిన వనరులపై చర్చించారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాడి రైతులకు 5 కిలోల కందుల బ్యాగులను అందజేశారు. ఈ సమావేశంలో మాల్ మదర్ డెయిరీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, రైతులు మహేందర్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా ఇంటింటి ప్రచారమా?

బీజేపీ నేతలపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం

ఆమనగల్లు: మున్సిపల్ ఎన్నికల ముందు బీజేపీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమనగల్లు మున్సిపల్ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ప్రజలను మరోసారి మోసం చేయడానికి ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల ముందు బీజేపీ నాయకుడు ఆచారి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద 2వేల పక్కా ఇల్లు తీసుకువస్తామని.. ఇళ్ల స్థలాలు లేనివారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని, నిరుపేదల కోసం షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మిస్తామని, జూనియర్ కాలేజీ భవన నిర్మాణం, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీకి కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకొని బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో టీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణ, శ్రీను, నిరంజన్‌గౌడ్, ఖలీల్, పంతునాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మకు బోనం సమర్పణ



ఆలయం వద్ద బోనాలతో మహిళలు

తుర్కయంజాల్: ఆషాఢ మాస తొలి బోనాన్ని గురువారం మున్సిపాలిటీ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి సమర్పించారు. మట్టి కుండలో వండిన పదార్థాలను అమ్మవారికి సమర్పించే ఆనవాయితీ ఆచారంగా వస్తుందని సంఘం అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి యాదగిరి, సభ్యులు అశోక్ కుమార్, శ్రీశైలం, రవిదాసు, ఆనంద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే దిష్టిబొమ్మల దహనం

మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్

తలకొండపల్లి: స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశానికి ఏం చేశారో చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన దేవుని పడకల్‌లో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారని మండి పడ్డారు.

రాయపోల్‌లో ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో గురువారం రాయపోల్ గ్రామంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, చైల్డ్ ఫండ్ ఇండియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగోజీకి సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నాగోజీని ఆ పాఠశాల సిబ్బంది గురువారం సన్మానించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం రోజున జిల్లా ఉత్తమ అధ్యాపకులుగా నాగోజీ పురస్కారాన్ని అందుకున్నారు. గురువారం నాగోజీని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, సిబ్బంది సన్మానించడంతో పాటు అభినందనలు తెలిపారు. మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.



మంచాల: నివాళి అర్పిస్తున్న ఆరుట్ల పంచాయతీ పాలకవర్గం



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలో..



తలకొండపల్లి: ఉద్యమకారులను సన్మానిస్తున్న శ్రీనివాసుయాదవ్

అమరుల త్యాగాలతోనే స్వరాష్ట్ర సాధన

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో గురువారం అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లో అమరవీరుల స్తూపం, చిత్రపటాలకు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు నివాళులు అర్పించారు. అమరులను స్మరించుకుని కొద్దిసేపు మౌనం పాటించారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్రం సాధ్యమైందన్నారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ అనిత, నాయకులు



కడ్తాల్: తెలంగాణ ఉద్యమకారులను సన్మానించిన నాయకులు



యాచారం: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ సుకన్య, నాయకులు



కడ్తాల్: నివాళులర్పిస్తున్న ఎంపీపీ కమ్లీ, నాయకులు



హయత్‌నగర్: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు



కడ్తాల్: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు



తుర్కయంజాల్: సంస్మరణ సభలో మున్సిపల్ పాలకవర్గం

25న ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో 25న ఉచిత మెగా కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బండలేమూర్ మాజీ సర్పంచ్ పోశమోని కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ మరియు శంకర కంటి వైద్యశాల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి నగరంలోని వైద్యశాలకు తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన సాయిలు(57) అనారోగ్యానికి గురై గురువారం మృతిచెందాడు. జెడ్పీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ రూ.3000, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి రూ.2000, సర్పంచ్ రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా జూలపల్లిలో మృతిచెందిన నాగార్జున కుటుంబ సభ్యులకు ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, విజయ్‌రెడ్డి, సంజీవ, రాఘవేందర్, ఉపసర్పంచ్ మణికంఠ, యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, శివలింగం, రాములు, యాదగిరిరెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమిని కాపాడండి'

ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ గ్రామంలోని శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు గురువారం ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలన్ని కొందరు అక్రమించేందుకు చూస్తున్నారని తెలిపారు. కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. గ్రామస్తులు రాంరెడ్డి, ఉదయ్‌పాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

యాచారంలో భారీ వర్షం

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. సంవృద్ధి వర్షాల్లేక రైతులు నేటి వరకు విత్తనాలు విత్తలేదు. కొన్ని గ్రామాల్లో పొలాలను సైతం సిద్ధం చేయలేదు. రోహిణి కార్తెలోనే వర్షాలు కురిస్తే మృగశిరా కార్తెలో విత్తనాలు వేసుకుంటే పంటలో దిగుబడి వస్తుందని రైతుల్లో నమ్మకం ఉంటుంది. మృగశిర కార్తె గురువారం పోతున్న సమయంలో వర్షం కురవడంతో రైతుల్లో పంటల సాగుపై ఆశలు చిగురించాయి. యాచారం, మాల్, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

చిన్నారుల చదువు బాధ్యత మాదే

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్



తలకొండపల్లి: చిన్నారుల చదువుకు హామీపత్రం అందజేస్తున్న వెంకటేశ్

తలకొండపల్లి: మండల పరిధిలోని తాళ్లగుట్టతండాకు చెందిన అనురాధ, చిట్టి నిరుపేదలు. అనురాధకు తల్లి, చిట్టికి తల్లిదండ్రులు లేరు. అనురాధ తాతా దగ్గర ఉండి 9వ తరగతి, చిట్టి తన బంధువుల దగ్గర ఉండి 5వ తరగతి చదువుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే ఉండటంతో స్థానిక నాయకుడు, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ పాండునాయక్ సహకారంతో పిల్లల బంధువులు జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ని కలిశారు. పిల్లలను చదివించాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ ఉప్పల ట్రస్టు ద్వారా పిల్లలిద్దరిని చదివిస్తానని, 10వ తరగతి వరకు ఖర్చులను తానే భరిస్తానని భరోసా పలికారు. ఆమనగల్లు ప్రజ్ఞ స్కూల్ యజమాన్యంతో మాట్లాడి పిల్లలిద్దరిని గురువారం స్కూల్‌లో చేర్పించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యకు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌గౌడ్, రుద్రాక్షల శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

గణేశ్ చదువుకు అండగా ఉంటాం..

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి గణేశ్‌కుపై చదువుల కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. గణేశ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మరోవైపు గణేశ్ తండ్రి ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో స్థానిక నాయకులు కిషోర్, కృష్ణనాయక్ ద్వారా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌ను గురువారం వారు కలిశారు. ఈ మేరకు స్పందించిన ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటే గణేశ్‌ను ఆమనగల్లు ప్రజ్ఞ పాఠశాలలో ఎనిమిదవ తరగతిలో చేర్పించారు. భవిష్యత్‌లో గణేశ్ ఉన్నత చదువుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'దశాబ్ది' పేరుతో దగా

- బీఆర్‌ఎస్ సర్కార్‌పై కాంగ్రెస్ నేతల ఫైర్
- పలుచోట్ల సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం



ఆమనగల్లు: కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరుతో పార్టీ ప్రచారం నిర్వహించుకుంటున్నారని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య ఆరోపించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణనాయక్, ఖలీల్, శ్రీశైలం, అలీం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: అమరవీరుల స్థూపం వద్ద వారి పేర్లను పెట్టకపోవడం దారుణమని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంగమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తుర్కయంజాల్‌లో సాగర్‌రహదారిపై కేసీఆర్ దిష్టిబొమ్మను నేతలు దహనం చేశారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను దగా చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. నాయకులు దాసు, రవీందర్‌రెడ్డి, నర్సింహ, రమేష్, శ్రీకాంత్, జంగయ్య, యాదయ్య, కిషన్, సంతోష్ పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కారు..

తలకొండపల్లి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అజీం, టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు పాల్గొన్నారు.

కంపు కొడుతోంది



నక్కర్తమేడిపల్లి పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు

- నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నిలుస్తున్న మురుగు
- దుర్వాసనతో విషజ్వరాలబారిన పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రైనేజీ నీరు చేరుతుండటంతో వచ్చే దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది కాలంగా గ్రామంలోని డ్రైనేజీ నీరంతా పాఠశాల ఆవరణలోకి వచ్చి చేరుతుంది. గతంలో గ్రామంలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరు పాఠశాల పక్కనే ఉన్న రైతుల పట్టా భూముల్లోకి చేరేది. పట్టా రైతులు డ్రైనేజీ నీటిని తమ వ్యవసాయ పొలాల్లోకి రానీయకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో పాఠశాల ప్రహరీ పక్కనే నిలుస్తున్న డ్రైనేజీ నీరు.. ఇంకి పాఠశాల ఆవరణలోకి చేరుతుంది. పాఠశాల ఆవరణలో డ్రైనేజీ నీరంతా కుంటలాగా మారింది. దీంతో దుర్వాసన వస్తుంది. డ్రైనేజీ నీరు నిలిచిన కుంట పక్కనే పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం వండే గదులు ఉన్నాయి. కుంట నుంచి వచ్చే దుర్వాసనతో తరగతి గదుల్లో విద్యార్థులు ఉండలేకపోతున్నారు. పాఠశాల పక్కనే రోడ్డు ఉండటం వల్ల రోడ్డుపై నుంచి వెళ్లే ప్రయాణికులు సైతం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

భోజనం తినలేని పరిస్థితి..

పాఠశాల ఆవరణలోనే డ్రైనేజీ నీరుతో కూడిన కుంట పక్కనే విద్యార్థులకు వంట సిబ్బంది మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తారు. భోజనం తినే సమయంలో దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు భోజనం తినలేని పరిస్థితి. వంట సిబ్బంది కూడా భోజనం వండి విద్యార్థులకు పెట్టి పూర్తయ్యే వరకు ముక్కుకు బట్టలు కట్టుకుంటున్నారు. డ్రైనేజీ నీరు చేరడంతో దోమల బెడద తీవ్రమై విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు. ఇటీవలే పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో డ్రైనేజీ దుర్వాసన, దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు బోధన చేయలేక, విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వచ్చిన ప్రతి అధికారికి, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

దుర్వాసన వస్తోంది



మధ్యాహ్న భోజనం వండే వంట గది పక్కనే డ్రైనేజీ కుంట ఉంది. దాదాపు నాలుగు గంటల పాటు తీవ్రమైన దుర్వాసనకు వంట వండలేకపోతున్నాం. విద్యార్థులు వాసనకు భోజనం తినడం లేదు. కడుపు నిండా తినలేక పస్తులుంటున్నారు. భోజనం కూడా వృథాగా మిగులుతుంది. సర్పంచ్, ఎంపీటీసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు.

– దేవదాసు, వంట మనిషి

సమస్య పరిష్కరిస్తాం



నక్కర్తమేడిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రైనేజీ నీరు చేరుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలో పాఠశాలను సందర్శించి సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులతో సమావేశమై డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం. పంచాయతీ లేక మండల పరిషత్‌నిధులతో పనులు చేయిస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దాం

బీజేపీ సీనియర్ నేత ఆచారి



ప్రజలతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నేత ఆచారి కోరారు. పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీలో గురువారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆచారి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలకు సంబంధించి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దివ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, బీజేపీ నాయకులు మల్లేశ్, విష్ణు, శ్రీను, లింగం, బ్రహ్మం, శ్రీశైలంయాదవ్, ఆనంద్,అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఉదయనగర్ కాలనీ, ప్రతిభానగర్‌త కాలనీలో కౌన్సిలర్లు లక్ష్మణ్, యాదమ్మఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: గ్రామాలకు ఇప్పటి వరకు ఇచ్చిన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేస్తే తిరిగి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన అనంతరం గ్రామాల రూపురేఖలు మారిపోయావన్నారు. ఎల్మినేడులో విద్యుత్ సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలని వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని విద్యుత్ అవసరాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాలు తదితర జాబితా, ఎస్టిమేట్ వేసి తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు సూచించారు. స్థానిక పెద్ద చెరువు నుంచి 11కేవీ విద్యుత్ లైన్లు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు వెంట 11 కేవీ లైన్లను వేసి సమస్యను పరిష్కరించాలని ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రాంరెడ్డి కోరారు. జిల్లాలో 25 లైబ్రరీలుంటే కొత్తగా ఒకేరోజు 30 లైబ్రరీలను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి తెలిపారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. సమావేశంలోమార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఏఈ శ్రీనివాస్‌రావు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.